
# కాపీరైటు లేని సినిమా కథ

జి.వి.జి




(ఈ సినిమాకథ ఐడియాకు కాపీరైటు లేదు ఏ నిర్మాత అయినా నిరభ్యంతరంగా ఇందులోని సన్నివేశాలను కాపీ కొట్టుకోవచ్చు. చూస్తూ చూస్తూ అంత (పిచ్చి) పని ఎవరూ చేయరు. ఎంచేతంటే— ఇందులోని సంఘటనలు లోగడ ఎన్నో చిత్రాలలో వచ్చాయి. ఇంకా ఎన్నో చిత్రాలలో తప్పక వచ్చి తీరుతాయి)

ఉరుములు...మెరుపులు...పశ్చిమ కనుమలలో కుంభవృష్టిగా వర్షం కురుస్తూన్న దృశ్యాలు...

ఒక భీకరమైన వికటాట్టహాసం...

హఠాత్తుగా నిశ్శబ్దం ... విద్యుద్దీప కాంతిలో ఒక పదునైన కత్తి జిగేల్మని మెరుస్తుంది. మళ్ళీ వికటాట్టహాసం... ఆ భీకరధ్వనికి ఒక చెట్టుమీదినించి కొన్ని పక్షులు భయంతో ఎగిరి వెళ్ళిపోతున్న దృశ్యాలు (స్టాక్‌షాట్లు)...వెంటనే గాఢాంధకారం...

ఒక స్త్రీ ఆర్తనాదం.

ఉన్నట్టుండి ఒక భవంతిలోని లైట్లన్నీ వెలుగుతాయి దఢదఢమని శబ్దం... (కెమేరా మెల్లగా పక్కకు 'పేన్' అవుతుంది)...ఒక వృద్ధుని శరీరం నగిషీ చెక్కబడిన మెట్ల పక్కనున్న దీపాన్ని ఊడేసి వచ్చినట్టు పడిపోతాడు.

(క్లోజప్)—ఏదో టెలిఫోన్ నెంబర్‌ను ఒక చెయ్యి డయల్ చేస్తుంది.

పోలీస్ స్టేషన్‌లో ఒకరు రిసీవర్ అందుకుంటారు.

రద్దీ ఉన్న రోడ్‌మీద రయ్యిమని పోలీస్‌జీప్ దూసుకు పోతుంది.


నల్లని ముసుగు ధరించిన ఒక ఆకారం మురికినీటి గొట్టం పట్టుకొని ఆ భవంతి నించి కిందికి జారి పెరటివైపుగుండా పారిపోయేసరికి—పోలీస్ జీపు ఆ భవంతి పోర్టికోలోకి వచ్చి ఒక్క కుదుపున ఆగిపోతుంది.

పోలీసులు బిలబిలమని ఆ భవంతిలోకి ప్రవేశిస్తారు నలుగురూ నాలుగు వైపులా పరుగులు తీశాక, తిరిగి వచ్చి హాల్లో కలుసుకొని, ఒకరి వంక మరొకరు తెల్లబోయి చూసుకుంటారు.

వాళ్ళను తోసుకొని ఒక అయిదేళ్ళ కుర్రాడు కెమేరా ముందుగా వచ్చి నిలుచుంటాడు. తను పెద్దయ్యాక—తన తండ్రిని అంత దారుణంగా హత్య చేసిన ఆ హంతకుని పట్టుకొని, వాడి పని పట్టించి తీరుతానని—పిడికిలి బిగించి, ప్రతిజ్ఞ చేస్తాడు. ఆ అబ్బాయి పిడికిలి 'క్లోజప్' మీద టైటిల్స్.

'టైటిల్స్' ముగిసేలోగా ఆ చిన్న పిడికిలి పెద్దదవుతుంది...కొన్ని రోమాలు క్రమక్రమంగా దట్టమవుతూ స్పష్టంగా కనిపిస్తాయి...కెమేరా వెనక్కు వెళ్ళేసరికి 'లాంగ్ షాట్'లో ఆ అబ్బాయి పెరిగి, యువకుడైనట్టు తెలుస్తుంది. అతనే హీరో!

హీరో హుషారుగా ఈల వేస్తూ,



లట్లోంచి బయటకు గెంతుతాడు.

మద్రాస్ సెంట్రల్‌స్టేషన్ ... హీరో ప్రమాదవశాత్తు ఒక అందమైన యువతిని ఢీ కొంటాడు. ఆ హీరోయిన్ కోపం తెచ్చుకోబోయి—హీరోను నఖశిఖ పర్యంతం అలా చూసినంతనే సిగ్గుతో తన ముఖాన్ని చేతులతో కప్పుకుంటుంది. హీరో, ఆమె వంక క్రీగంట చూస్తాడు. ఇద్దరి చూపులూ కలుస్తాయి. వాళ్ళ కళ్ళే మాట్లాడుకుంటాయి.

ఫేడ్ ఇన్...

క్రోటన్ మొక్కలకు రోజా పువ్వులు; తుమ్మ చెట్టుకు మామిడికాయలు, ఆనవ పాగుకు పొట్లకాయలు ఉన్న సెట్‌లో ఒక చెట్టు మీద ఆడ పావురాన్ని మగ పావురం ముక్కులో - పొడుస్తూంటుంది. దూరంగా మచ్చలేని పున్నమి చంద్రుడు సిల్కుని దారాలకు వేలాడుతూంటాడు ... కెమెరా కాస్త వెనక్కు వెళ్ళగానే ఆ చెట్టుకింద —మిడ్ లాంగ్ షాట్‌లో హీరో హీరోయిన్‌లు చెట్టాపట్టాలేసుకొని పరుగెత్తుతూంటారు. బాక్‌గ్రవుండ్ మ్యూజిక్ స్టార్ట్ అవుతుంది...

నాగలాపురం గుడిముందు హీరో హీరోయిన్‌లు దోబూచులాడుతూ జంట పాట ప్రారంభిస్తారు—'ఏదో ఒక్క చోట —మన శరీరాలు రెండూ కలిసి పోనీ' అని ద్వంద్వార్థాలిచ్చే భావం...హీరో చివాలున హీరోయిన్ కొంగును లాగేస్తాడు.

హీరోయిన్ సిగ్గుతో తన వక్షస్థలాన్ని రెండుచేతులతో కప్పుకొని, చార్‌మినార్ వెనక్కు వెళ్ళి దాక్కోబోతుంది. హీరో వెంటబడతాడు. ఇద్దరూ సాతనూర్ డామ్ మధ్యకు వచ్చేస్తారు.

కెమెరా జూమ్...మద్రాసు ఎల్. ఐ. సి. బిల్డింగ్ మీదినించి విలన్ తుపాకిని హీరో వంక గురిపెట్టి, వాళ్ళ 3 నిమిషాల 20 సెకండ్ల జంటపాట పూర్తయ్యేవరకు తాను ఆగాలని ఎదురు చూస్తూంటాడు.


హీరో, హీరోయిన్‌ను బాహువుల్లో బంధించి, ఒక ఫౌంటెన్ దగ్గరికి ట్విస్ట్ చేస్తూ అలాగే నడిపించుకు వెళ్తాడు. వాళ్ళ ఇద్దరి ముఖాల క్లోజప్. వాళ్ళ పెదవులు దగ్గరికి రాబోతూండగా—హీరోయిన్ సెన్సార్ కత్తెరలా ఒక గడ్డిపరకను తన పెదవుల మధ్యగా ఉంచి, 'ఇప్పుడు కాదు; మన వివాహం అయ్యాక,'అంటుంది. ఇద్దరూ చివాలున కూర్చుంటారు. వాళ్ళ వెనుక ఫౌంటెన్‌లోంచి నీరు మరింత ఎత్తుకు చిమ్మడం మాత్రం కనిపిస్తుంది.

పాట పూర్తవగానే విలన్ తుపాకీ ట్రిగ్గర్ నొక్కుతాడు. హీరో బాధతో 'గుండె' అదుముకొని, వెలితిరిగి నేలకు ఒరుగుతాడు. హీరోయిన్ ఒక్క గావుకేక పెట్టి, హీరోమీద పడిపోతుంది. తర్వాత తన చీర కొంగును రిబ్బన్ ప్రమాణంలో చించి, అతని 'తల'కు కట్టు కడుతుంది.

జెనరల్ హాస్పిటల్...హీరో 'కాళ్ళ'కు తెల్లని కట్లు ఉంటాయి. అతనికి డాక్టర్ ఒక ఇంజెక్షన్ ఇచ్చి, బయటకు వెళ్ళబోతాడు. హీరోయిన, ఆ డాక్టర్‌ను అనుసరిస్తుంది. అతనికి బాగా విశ్రాంతి అవసరమని—ఆ గెస్ట్ ఆర్టిస్టు డైలాగ్ చెప్పేసి, తన తల గుమ్మానికి ఎక్కడ కొట్టుకుంటుందోనని వొంగి వెళ్ళిపోతాడు.

'నా మూలంగాకదా నీకీ ఆపద వచ్చింది?' అనే భావంతో హీరోయిన్ ఎలుగెత్తి ఒక శోకగీతిక ఆలాపిస్తూ, హీరో మంచం దగ్గరికి చేరుతుంది. హీరోయిన్ దుస్థితికి అక్కడున్న ఒక నర్సు కళ్ళు కూడా చెమ్మగిల్లుతాయి.

- ఇకప్తై విషాద సన్నివేశం తర్వాత



కావేక్షకుల రిలీఫ్‌కోసం ఒక వినోద ప్రవేశం...

హాస్యనటుడు ఆడవేషంలో వెనుకపాటున వచ్చి, హఠాత్తుగా హాస్యనటిని అదర గొడ్తాడు. అతనామెను బాహువుల్లో అందించేసరికి, హాస్యనటి—ఆ పట్టును గుర్తించినట్లు తల ఊపి, 'బావా, వెనుక వించి పొడవడం కూడా మొగతనమా ?' అంటూ ఆనందంతో అతని బాహువుల్లో వాలిపోతుంది.

మిక్స్ టు...

డ్రీమ్ సీక్వెన్స్...మబ్బులు...గ్యాస్...సబ్బు నురగలు... అక్కడక్కడ కళాదర్శకుని శిల్ప చాతుర్యాన్ని చాటే అందమైన స్తంభాలు... హీరో కృష్ణుడి వేషంలో, హీరోయిన్ రాధ వేషంలో ఒక జంటపాట...పాటపూర్తయ్యే సరికి హీరో ఒక చేతిని పట్టుకుంటాడు.

టర్న్ వైప్...

లిఫ్ట్ బిల్డింగ్స్‌మీది గడియారం పన్నెండు గంటలు కొడుతుంది ... గాఢాంధకారం... మంచంమీద గాఢ నిద్రలో ఉన్న హీరోను అమాంతంగా నలుగురు దుండగులు మోసు కొనివెళ్ళి ఒక జీప్‌లో తమ రహస్య స్థావరానికి చేర్చేస్తారు.

హీరోను విలన్ ఒకస్తంభానికి కట్టేసి కొరడాతో కొడుతూండగా — పక్కగది

# ...సినిమా కథ

లోంచి హీరోయిన్ తల విరగబోసుకొనివచ్చి 'నాన్నా ఇతను నా ప్రియుడు. ఇతన్నేం చేయకు' అని బావురుమంటుంది.

'అమ్మాయీ ఇక ఇతన్ని నువ్వు మరచి పోవాలి' అంటాడు విలన్.

హీరోయిన్ ఆవేశంతో 'నాన్నా! నేను భారత నారిని. ఈ పవిత్రగడ్డపై పుట్టిన ఏయువతియైన ఒకేసారి ఒకనికే మనసును అర్పిస్తుంది' అంటుంది.

'అలాగామ్మా నిలుపుంటావేం? అమ్మా యిని తీసుకెళ్ళి, ఏ గదిలోనో కట్టి పడ వెయ్యండి...' అని విలన్ తన అనుచరులకు ఆజ్ఞాపించాక, గంభీరంగా హీరోవంక తిరిగి, 'ఇకనైనా ఆ రహస్యం చెప్తావా— చెప్పవా?' అని గర్జిస్తాడు.

'నా కంఠంలో ప్రాణముండగా చెప్పను' అంటాడు హీరో మొండిగా.

'ఐతే, మీపని కానివ్వండి'—అన్నట్లు విలన్, తన అనుచరులైన ఇద్దరు మహా కాయులవంక చూసి సైగ చేస్తాడు. వాళ్ళు కొరడాలను చేతికెత్తుకొని బలంగా విదిలి స్తారు.

హీరో బాధతో పళ్ళు కొరుకుతాడు. అతని నోటినించి నల్లటి రక్తం కారుతుంది.

మరోక్షణంలో అతను స్పృహ తప్పి తల వాల్చేస్తాడు. విలన్ ఆనందంతో వెనుతిరిగి, 'ఈ దుర్మార్గుడు పట్టుబడడంతో మన కున్న అడ్డంకులన్నీ తొలగి పోయినట్లే. ఈ సంతోష సమయాన్ని మనమందరం సద్వినియోగం చేసుకుంటాం,' అంటూ చప్పట్లు కొడతాడు.

వెంటనే ఒక అర్ధ నగ్నంగా ఉన్న నర్తకి చటుకి కొంకర్లు పోయినట్లు స్పాట్‌లైట్‌లో వొళ్ళు విరుచుకుంటూ లేచి, మెలికలు తిరుగుతూ నృత్యం చేయ నారంభిస్తుంది.


బంధితుడై ఉన్న హీరో ఎదురుగా నైట్‌క్లబ్‌లా ఉన్న ఆ హాలులో నర్తకి నృత్యం చేస్తూంటే, విలన్ అనుచరులతో సహా మద్యం సేవిస్తూ, తూలుతూంటారు. దూరంగా లాంగ్ షాట్‌లో బాండ్ కని పిస్తూంటుంది. ఒకరిద్దరు బిటిర్స్ వేషంలో హవాయిన్ గితార్లు చేతబట్టి, వొణికిపోతూ వాయించేస్తూంటారు. బాంగో డ్రమ్స్ మీద కొందరు చేతులు కొట్టేస్తూ...

ఇంతలో — బట్లర్ వేషంలో హాస్య నటుడు — ఎవ్వరికీ తెలియకుండా వెళ్ళి, హీరో చేతులకున్న కట్లను కత్తితో కోసేసి, బంధ విముక్తుణ్ని చేస్తాడు.

ఇప్పుడు హీరో చేతిలో మెషిన్‌గన్ ఉంటుంది. దాన్ని అందరికీ గురిపెట్టి 'చేతులెత్తండి!' అంటాడు.

విలన్ ఆయాసంతో లేచి, ప్రయాసతో చేతులు ఎత్తినట్లే ఎత్తి, చిపాలున తలుపు తీసుకొని, పక్కగదిలోకి పారు కుంటాడు. అది ఏవేవో పొగ గొట్టాలున్న గది. అందులో ఏదో మీటను విలన్ నొక్క గానే— ఒక పుస్తకాల అలమారు గిర్రున తిరిగి, ఆ స్థానంలోకి ఒక సూట్‌కేస్ వస్తుంది. దాని మూత తెరిచి, విలన్ తేరిపార చూస్తే, అందులో కొన్ని నోట్ల కట్టలు, మన దేశంలోని ఒకానొక ఆటా మిక్ పవర్ స్టేషన్‌కు సంబంధించిన కొన్ని బ్లూప్రింట్లు ఉంటాయి. విలన్ ఆ మూత మూసి, వికృత నవ్వుతో దాని వంకించాక, ఒక్క అంగలో వెళ్ళి, తన టాపులేని కారులో ఆ సూట్ కేస్ ను పడేసి, తనూ కూర్చొని స్టార్టు చేస్తాడు.

హీరో, హాస్యనటుడు అక్కడికి వచ్చి



లోగా విలన్ కారు తుర్రుమంటుంది.

'మనదేశానికి అతి ముఖ్యమైన బ్లూ ప్రింట్లతో పారిపోతున్నాడు. ఆ దేశద్రోహిని పట్టుకోవాలి,' అంటూ హీరో కంగారుగా అటు ఇటు చూస్తాడు ఓ మూల ఒక ఒంటెద్దు బండి సిద్ధంగా ఉంటుంది. వెంటనే వాళ్ళిద్దరూ పరుగున వెళ్ళి, ఆ బండిలో కూర్చుంటారు. హాస్యనటుడు 'హేయ్' అనగానే ఎద్దు పరుగు లంకించుకుంటుంది.

విలన్ కారు 'S' ఆకారంలో ఉన్నరోడ్డు మీద రయ్‌మని పోతూంటుంది.

హాస్యనటుడు ఎద్దు తోకను మెలిపెట్టడంతో, బండి వేగం మరింత హెచ్చుతుంది.

విలన్ కారులోని స్పీడా మీటర్‌లోనిముల్లు 80. మై. నించి 90 మై. దాకా జరుగుతుంది

ఎద్దుబండి రైల్వే లెవల్ క్రాసింగ్‌ను దాటాక విలన్ కారును సమీపించబోతుంది.

విలన్ పిస్టల్ అందుకొని, వెనుక వైపుగా పేలుస్తాడు.

తూటా రివ్వున హాస్యనటుడి చెవి పక్కగా దూసుకుపోతుంది.

ఇంతలో విలన్ కారు పక్కగా ఎద్దుబండి పోతూండగా హీరో ఒక్క గెంతున ఆ కారులోకి దూకుతాడు విలన్ ఒక చేత్తో స్టీరింగ్ తిప్పుతూనే, మరొక చేత్తో హీరోతో పోరాడుతాడు.

హోరాహోరీ పోరాటం...

కారు మెలికలు తిరుగుతూ, పిర్కాడ్ కోనల్లో దూసుకుపోతూంటుంది.

విలన్‌కు బాగా దెబ్బలు తగులుతాయి. అతను శోషిల్లుతూండగా— అతని చేతిలోని స్టీరింగ్ కంట్రోల్ తప్పుతుంది. అది గమనించిన 'హీరో' ఉన్నట్టుండి ఆ కారులోంచి బయటకు గెంతుతాడు.

కారు ఒక తిరుమల కోనమీద నించి తగలబడిపోతూ, కిందగోదావరి నదిలో పడిపోతుంది. ఫేడ్ అవుట్...

ఫేడ్ ఇన్... హీరో ధైర్య సాహసాలకు మెచ్చుకుని, ఒక రక్షణశాఖా మంత్రి కాబోలు ఒక పతకాన్ని ఇస్తాడు. హీరో సెల్యూట్ చేస్తూ, వెనక్కు వెళ్ళుతాడు.

కట్ టు...

హీరో ముందుకువస్తాడు. ఇప్పుడతని పక్కన సర్వాలంకార శోభితంగా హీరోయిన్ ఉంటుంది వాళ్ళిద్దరూ కాశ్మీర్ సరస్సులో మోటార్‌బోట్‌లో కూర్చొని షయనమై తర్వాత తాజ్‌మహల్ ముందుగా వచ్చి నిలుచుంటారు.

అక్కడికి హాస్యనటుడు, హాస్యనటి, హాస్యనటి తండ్రి ఆనందంగా వస్తారు.

'ముహూర్తం సమీపించింది—పదండి' అంటాడు హాస్యనటితండ్రి.

మిక్స్ టు ...

పెళ్ళి పందిరిలో హీరో—హీరోయిన్‌లకు, హాస్యనటుడు— హాస్యనటికి వివాహం జరిగిపోతుంది.


సన్నాయి ... పురోహితులు...అక్షింతలు చల్లడంలాంటి మాంటేజ్ షాట్స్.

హాస్యనటి తండ్రి ఆనందోద్రేకంతో ఆనంద భాష్పాలు రాలుస్తూ 'అల్లుడూ!' అని ఆప్యాయంగా పిలుస్తాడు.

హాస్యనటుడు చెంగున గంతేసి 'మామగారూ మామగారా అలా నోరారా అల్లుడనపించుకున్నానా—లేదా?...' అంటాడు.

'ఆ ఏడుకొండలవాని దయవల్ల అంతా శుభంగా ముగిసింది...శుభం!' అని హాస్యనటి తండ్రి అంటూండగా—అందరూ కొయ్యబారి పోయినట్లు బిగుసుకు పోతారు. ఆ 'స్టాప్‌బ్లాక్'మీద 'శుభం' అన్నకార్డు వస్తుంది.

శుభం... ఫేడ్ అవుట్. ●




ప్లాటిపస్‌లాగే దీనికి కూడా పిల్లలుపెట్టే అలవాటు రాలేదు. గుడ్లనే పెడుతుంది, స్తన్యజీవి అయినా. శరీరంమీద వెంట్రుకలకు మారుగా ముళ్ళపందిలాగా ముళ్ళుంటాయి. బాతు ముక్కుకు బదులు, సన్నగా పొడవుగా ముక్కు దీనికుంటుంది. లోపలనాలిక వానపాము ఆకారంలో ఉంటుంది.

కాలిగోళ్ళు బలంగా ఉంటాయి. వాటితోటే గోతులు తవ్వుకొని, నేలలో నివసిస్తాయి. అంతేకాదు కంగారూలాగా వీటికి ఒకసంచి ఉంటుంది. అందులో 2 గుడ్లు పెట్టి, పిల్లలు చేసుకొని పొదిగి పెంచుకొంటాయి. 3, 4 అంగుళాల పెజా పెరిగే వరకూ ఆసంచిలోనే కొన్ని వారాలపాటు ఉంటాయి.

ఆస్ట్రేలియా, టాస్మేనియా, న్యూగినీలో ఇవి ఉంటాయి. రక్షణ అవసరమైతే, గుండ్రంగా, ఉండలాగా చుట్టుకో పోతాయి. బలమైన ముక్కుతోటి, గోళ్ళతోటి చీమల పుట్టలు పడగొడతాయి. బయటకు వచ్చే చీమలు, దీనినాలిక జిగురుగా ఉండడంవల్ల అంటుకొనిపోతాయి. అవే దాని ఆహారం!

—జమ్మి కోనేటిరావు